క్లుప్తంగా

కనకదుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే కాటసాని దంపతులు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దంపతులు

బనగానపల్లె : విజయవాడ కనకదుర్గమ్మను మంగళవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, సతీమణి కాటసాని జయమ్మ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్నివర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీని ప్రజలు మరోమారు గెలిపించేలా ఆశీర్వాదించాలని అమ్మవారిని కోరుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

బీమా సాయం అందజేత



నగదు అందజేస్తున్న కౌన్సిలర్ రమణ

డోన్ టౌన్ : పట్టణ పరిధిలని పోచా ప్రభాకర్ రెడ్డినగర్‌కు చెందిన దూదేకుల లాల్ బాషా మృతి చెందారు. ఈ మేరకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ. 10వేలను మంగళవారం మృతుడి భ్యార్య దూదేకుల సిద్దమ్మకు కౌన్సిలరు ఆర్జ్ రమణ అందజేశారు. కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్ బషీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లికార్జునరెడ్డి, సచివాలయం సిబ్బంది అలివేలి తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి పెద్దపీట



విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న చేస్తున్న గుండంశేషిరెడ్డి

బనగానపల్లె : విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండం శేషిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పలుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం 8వ తరగతికి చెందిన 86 మంది విద్యార్థులకు ఆయన ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పాలనలో నాడు నేడు ద్వారా పాఠశాలలు అభివృద్ధి చెందడంతో పాటు విద్యాభివృద్ధికి తీసుకున్న చర్యలతో విద్యాప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గౌరిశంకర్, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, పుల్లరెడ్డి జగదీశ్వరరెడ్డి తదితరుల పాల్గొన్నారు.

పాలుట్ల రంగస్వామికి వెండి గంట బహూకరణ



అర్చకునికి వెండి గంటను అందజేస్తున్న దాతలు

బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లె కొండల్లో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత పాలుట్ల రంగస్వామికి మంగళవారం వెల్దుర్తి మండలం గోవర్ధనగిరికి చెందిన చంద్రన్న, లక్ష్మీదేవి దంపతులు 40 తులాల వెండి గంటను బహూకరించారు. వెల్దుర్తి మండలం గోవర్ధనగిరి గ్రామానికి చెందిన చంద్రన్న, లక్ష్మీదేవి దంపతులు వెండి గంటను ఆలయ అర్చకులు విష్ణువర్ధన్ ఆచార్యులకు అందజేశారు. స్వామి, అమ్మవార్ల పూజల అనంతరం దాతలకు అర్చకులు విష్ణువర్ధన్ ఆచార్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

27న మంత్రి బుగ్గన రాక

బేతంచెర్ల: మండల పరిధిలోని గోరుమానుకొండ గ్రామ సమీపాన కర్నూలు ప్రధాన రహదారి పక్కన్న పూర్తయిన అభివృద్ధి పనులను మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఈనెల 27 ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం మున్సిపల్ చైర్మన్ చలం రెడ్డి, డీఈ ప్రసాద్ రెడ్డి, సీఐ ప్రియతం రెడ్డి, ఎస్ఐ శివ శంకర్ నాయక్ మంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. ఐటీఐ కళాశా, ఎంఎస్ ఎంఈ సెంటర్, బీసీ గురుకుల పాఠశాల ప్రారంభోత్సవం, సభ ఏర్పాట్లపై చర్చించారు.

అంగన్‌వాడీల విజయోత్సవ ర్యాలీ

డోన్ టౌన్ : రాష్ట్ర ప్రభుత్వంతో అంగన్‌వాడీల నాయకులు జరిపిన చర్చలు సఫలం కావడంతో మంగళవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. చలో విజయవాడకు వెళ్లి వచ్చిన నాయకులు, అంగన్వాడీ టీచర్లకు పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికి పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శివరామ్, సీపీఎం మండల పట్టణ కార్యదర్శులు నాగరాజు,నక్కి శ్రీకాంత్, అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు షేబారాణి తదితరులు ఉన్నారు.

అవుకు ఎస్ఐ వీఆర్‌కు..?

అవుకు: అవుకు ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న విష్ణునారాయణకు వీఆర్‌కు పంపినట్లు సమాచారం. గతేడాది అక్టోబర్ నెలలో బాధ్యతలు స్వీకరించిన ఈయనపై పలు అవినీతి ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు వీఆర్‌కు ఆదేశించినట్లు తెలిసింది.

అభివృద్ధి పథంలో సీతారామాపురం

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మారిన రూపురేఖలు
- ప్రభుత్వ కార్యాలయాలతో కళకళలాడుతున్న గ్రామం
- సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



గ్రామంలో విశాలంగా సీసీ రోడ్డు

బేతంచెర్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పల్లెలు ప్రగతిబాట పట్టాయి. మండల కేంద్రాలతోపాటు గ్రామాలు రూపురేఖలు మారిపోయాయి. ప్రభుత్వ కార్యాలయాలు, సీసీ రోడ్లతో పల్లెలు కళకళలాడుతున్నాయి. ఈ మేరకు మండల పరిధిలోని సీతారామాపురం గ్రామం సైతం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోంది. సుమారు 300 కుటుంబాలు 1,500 మంది ఓటర్లు ఉన్న ఈ గ్రామం ప్రస్తుతం మౌలిక వసతుల కల్పనతో అభివృద్ధి చెందింది. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరువతో దాదాపు మౌలిక వసతులు చేకూరాయి. సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలు, సీసీ రోడ్లతో పట్టణ శోభ సంతరించుకుంది. దీంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సీతారామాపురంలో ఊరవాకిలి నిర్మించి అందులో సీతారాముల ఏర్పాటు చేయడంతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. గ్రామంలో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు, మరో రూ. 5 లక్షలతో డ్రైనేజీ కాలువలు, రూ.25 లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం, రూ.10 లక్షలతో పొలాల రహదారి ఏర్పాటు చేశారు. అదేవిధంగా మన బడి నాడు-నేడు పథకంతో పాఠశాలరూపు రేఖలే మారిపోయాయి. ఏళ్లతరబడి నెలకొన్న సమస్యలు దాదాపు తీరాయని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తూ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



రూ. 2.80 కోట్లతో డబుల్ రోడ్డు

సీతారామాపురం మెట్ట నుంచి గ్రామానికి దాదాపు మూడున్నర కిలోమీటర్ల రోడ్డు అధ్వానంగా ఉండేది. రాకపోకలకు చాలా ఇబ్బందిపడేవారు ఆయా గ్రామాల ప్రజలు. మంత్రి బుగ్గన ప్రత్యేక చొరువతో రూ. 2.80 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణం అయ్యింది. డబుల్ రోడ్డును మంత్రి 2021 అక్టోబర్ 24వ తేదీన ప్రారంభించిన విషయం తెలిసిందే. ఏళ్లతరబడి పడిన ఇబ్బందులు తొలగిన నేపథ్యంలో మంత్రి బుగ్గన ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



మెట్ట నుంచి సీతారాపురం గ్రామం వరకు నిర్మించిన డబుల్ రోడ్డు

గాంధీ కలలు సాకారం



జాతిపిత మహాత్మాగాంధీ కలలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాకారం చేస్తుంది. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీసుకొచ్చిన సచివాలయ, వలంటీర్ వ్యస్థలతో ప్రజల వద్దకే పాలన సాగుతుంది. సచివాలయం, ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ నిర్మాణాలతో గ్రామానికి కొత్త శోభ వచ్చింది. గ్రామాభివృద్ధికి ప్రత్యేక చొరువ తీసుకున్న మంత్రి బగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సాయం మరువం. గ్రామస్తుల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు.

– వేణుగోపాలు రెడ్డి, సర్పంచ్

చాలా సంతోషంగా ఉంది



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మా గ్రామం చాలా అభివృద్ధి చెందింది. సంక్షేమం పథకాల అమలుతో ప్రజలు ఆర్థికంగా మెరుగుపడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలతో మా ఊరు రూపురేఖలు మారాయి. ప్రత్యేకించి నూతనంగా డబుల్ రోడ్డు బాగుంది. వైద్య సేవలు బాగా అందుతున్నాయి. గ్రామం అభివృద్ధిని చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది.

– హనుమంత్ రెడ్డి,గ్రామస్తుడు

26 నుంచి డోన్ నియోజకవర్గంలో పర్యటించనున్న మంత్రి బుగ్గన



డోన్ టౌన్ : కర్నూలులో 26వ తేదీన జరిగే రిపబ్లిక్ డే వేడుకల్లో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పాల్గొంటారని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి,జెడ్పీటీసీ రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. అదే రోజు డోన్‌కు చేరుకుని సాయంత్రం 5 గంటలకు డాక్టర్ సుబ్బరామయ్య పార్క్‌లో ఏర్పాటు చేసిన స్విమ్మింగ్ పూల్‌ను మంత్రి ప్రారంభిస్తారన్నారు. అనంతరం రూ.45 లక్షలతో పునర్నిర్మించిన షాదిఖానాను ప్రారంభిస్తారని తెలిపారు. అదేవిధంగా 27వ తేది ఉదయం 11 గంటలకు ఆటో నగర్ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అనంతరం బేతంచెర్ల పట్టణానికి చేరుకొని ప్రభుత్వ ఐటీఐ, ఎంఎస్ఎంఈ భవనాలతో పాటు బీసీ రెసిడెన్సియల్ స్కూల్ బిల్డింగ్‌లను ప్రారంభిస్తారన్నారు. 28వ తేదీన డోన్ పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డుతో పాటు క్లబ్ హౌస్, కూరగాయల మార్కెట్, వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి, బీసీ రెసిడెన్సియల్ స్కూల్ ప్రాంభోత్సవ కార్యక్రమాల్లో మంత్రి పాల్గొంటారన్నారు. 29వ తేదీన బేతంచెర్ల మండలం కేకే కొట్టాల వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన బిల్లల స్వర్గం గుహలు, బుగ్గానిపల్లె వద్ద వాటర్ గ్రిడ్ పథకాన్ని ప్రారంభిస్తారన్నారు. సాయంత్రం ప్యాపిలి మండలం రాచవాండ్ల పల్లి చేరుకొని రోడ్డు, బ్రిడ్జిలను ప్రారంభిస్తారన్నారు. అదేవిధంగా బోయవాండ్ల పల్లె వద్ద ఏర్పాటు చేసిన వాల్మీకి గుహలను మంత్రి బుగ్గన ప్రారంభిస్తారని వారు వివరించారు.

విద్య, వైద్య రంగాలకు పెద్దపీట



వృద్ధులకు కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ మెట్ల సరళ



రోగులకు మందులు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కోవెలకుంట్ల: ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేసిందని కోవెలకుంట్ల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మెట్ల సరళ, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు షాజహాన్ అన్నారు. మంగళవారం పట్టణంలోని 1వ గ్రామ సచివాలయ పరిధిలో రెండవ విడత ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆయా కాలనీలకు చెందిన 270 మంది మహిళలు, 248 మంది పురుషులు ఓపీ నమోదు చేసుకున్నారు. మాయలూరు, నంద్యాల ఉదయానంద ఆసుపత్రులకు చెందిన డాక్టర్లు రాబర్ట్‌కెన్నేడి, అశోక్ హరికృష్ణ, సుప్రియ, కంటి వైద్య నిపుణుడు గంగాధర్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే 53 మందికి కంటి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, ఈఓ గోపినాథ్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

504 మందికి వైద్య పరీక్షలు

సంజామల: మండల పరిధిలోని గిద్దలూరు గ్రామంలో మంగళవారం ఏంపీడీఓ నాగకుమార్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరం నిర్వహించారు.వైద్యులు చంద్రశేఖర్ రెడ్డి,శ్రీకాంత్,మేఘన 504 మందికి వైద్య సేవలు అందించి వారికి ఉచిత మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రామ చంద్ర రెడ్డి,ఈఓఆర్‌డీ పాపరాయుడు,పంచాయితీ కార్యదర్శి విష్ణు వర్ధన్ రెడ్డి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్ చంద్రశేఖర్‌నాయుడు

డోన్ రూరల్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనిస్తున్నారని సర్పంచ్ చంద్రశేఖర్‌నాయుడు తెలిపారు. మండల పరిధిలోని వెంకటనాయునిపల్లిలో మంగళవారం వైద్య అధికారి చెన్న కేశవులు ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పేదలకు గ్రామాలలలోనే వైద్యం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ప్రభాకర, చెన్నయ్య, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలవరం

బనగానపల్లె రూరల్ : జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు పేదలకు వరంలాంటివని ఎంపీపీ మానసవీణ, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ జనార్థన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పసుపల గ్రామంలో జగనన్న సురక్ష ఆరోగ్య శిబిరం ఎంపీడీఓ శివరామయ్య అధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగనన్న ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారని గుర్తు చేశారు. డాక్టర్ సోహెల్‌బాబు, జగదీశ్వర్‌రెడ్డి, రాజేష్ ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో ప్రజలకు అందుతున్న వైద్యసేవలను ఎంపీడీఓ శివరామయ్య ఎంపీపీకి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మోహన్‌బాబు, వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ నాయకులు ఈశ్వర్ నాయక్, పాపన్న తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో అందుతున్న సేవలను ఎంపీపీకి వివరిస్తున్న ఎంపీడీఓ శివరామయ్య

ఎన్‌ఆర్‌ఐ దాతృత్వం

డోన్ : ఆలయాల పునర్నిర్మాణానికి విరాళాలు అందిస్తూ దాతృత్వాన్ని చాటుకుంటున్నాడు ఎన్‌ఆర్‌ఐ, డోన్ పట్టణానికి చెందిన మిరపకాయల కొండన్న, లక్ష్మీదేవిల కుమారుడు వెంకటేశ్వర్లు. వెంకటేశ్వర్లు ఖతర్‌లో పనిచేస్తున్నారు. డోన్ పట్టణ పోలీసుస్టేషన్ పక్కనున్న సాంబ శివాలయ పునర్నిర్మాణానికి తన వంతుగా వెంకటేశ్వర్లు రూ.50వేలను మంగళవారం ప్రధాన అర్చకులు కళ్లె శేషావలిశర్మకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్యాపిలి పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.8లక్షలను ఇప్పటివరకు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. సేవా కార్యక్రమాల్లో స్ఫూర్తిగా నిలుస్తున్న వెంకటేశ్వర్లును పలువురు అభినందిస్తున్నారు.



సాంబ శివాలయ అర్చకునికి రూ.50వేలు విరాళం అందజేస్తున్న వెంకటేశ్వర్లు

వైభవంగా సీతారాముల శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

ప్యాపిలి: అయోధ్యలో బాలరాముడికి ప్రాణప్రతిష్టను పురస్కరించుకుని మంగళవారం ప్యాపిలి పట్టణంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో భక్తులు వైభవంగా శోభాయాత్ర నిర్వహించారు. ప్రజలు సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, రామాంజనేయులు, దేవీదయానంద్ సింగ్ తదితరులు మాట్లాడుతూ అయోధ్యలో రామాలయం నిర్మించడంతో పాటు బాలరాముడి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. అనంతరం స్థానిక అంకాళ పరమేశ్వరి దేవాలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ కార్యదర్శులు కంచి నరేశ్ కుమార్, నాయకులు జయకృష్ణ,వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

కొలిమిగుండ్ల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం విద్యార్థులకు ప్రిన్సిపాల్ భోజనం వడ్డించారు. త్వరలో ప్రాక్టికల్స్,పబ్లిక్ పరీక్షలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో విద్యార్థులకు మంచి పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో కళాశాల అధ్యాపకులు, నాన్‌టీచింగ్ సిబ్బందితో కలిసి సొంత ఖర్చులతో మధ్యాహ్న భోజనం ప్రారంభించామని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసులురెడ్డి, బాల ఓబన్న, ఓబయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి భోజనం వడ్డిస్తున్న ప్రిన్సిపాల్

యాజమాన్యాలు నిబంధనలు పాటించాలి

బనగానపల్లె రూరల్ : మైనింగ్ పరిశ్రమలు యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని డీఆర్‌ఓ పుల్లయ్య సూచించారు. మంగళవారం మండలంలోని చెరువుపల్లె గ్రామ సమీపంలోని సలామాబాద్‌లోని సర్వే నంబరు 21/పీలో 2.193 హెక్టార్లు, సర్వే నంబరు 22లో 0.906 హెక్టార్లు, సర్వే నంబరు 322/1,327/1లో 1.093 హెక్టార్లలో పారిశ్రామిక వేత్తలు నాగిరెడ్డి, ఎస్ సంజీవరెడ్డి, ఎస్ స్నేహ మైనింగ్ ఉత్పత్తి కోసం లీజు మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. లీజుకు సంబంధించి పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం జిల్లా కాలుష్యనియంత్రణ అధికారి మునిప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్‌ఓ పుల్లయ్య మాట్లాడుతూ పరిశ్రమల యాజమాన్యాలు స్థానికులకు ఉద్యోగులు కల్పించాలన్నారు. మెటిరియల్ తరలించే సమయంలో భద్రత ప్రామాణాలు పాటించాని సూచించారు. అలాగే పరిశ్రమల్లో వచ్చే ఆదాయంలో గ్రామాల అభివృద్ధికి కేటాయించాలని సూచించారు. పరిసర గ్రామాల్లో మొక్కలు పెంచి సంరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గుండం నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తుందని, దీంతో స్థానికులకు ప్రత్యేక్షంగా పరోక్షంగా ఉద్యోగాలు వస్తాయన్నారు. పలువురు పర్యావరణ శాస్త్రవేత్తలు,పరిసర గ్రామాల ప్రజలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారి మునిప్రసాద్ మాట్లాడుతూ ప్రజాభిప్రాయంలో తెలిపిన అభ్యంతరాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. లీజు మంజూరు చేసేదిశగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పారిశ్రామివేత్తలు ఎస్ వెంకట్రామిరెడ్డి, గుండంశేషిరెడ్డి, కొండారెడ్డి, సర్పంచ్ సుమలత, నందివర్గం స్టేషన్ ఎస్ఐ తిరుపాల్, పలుకూరు, దేవనగర్, చెరువుపల్లె గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ పుల్లయ్య

గ్రామ దేవతలకు పుష్యమాస పూజలు

బేతంచెర్ల: స్థానిక బనగానపల్లె రహదారిలో వెలసిన పుట్ట పెద్దమ్మకు పుష్యమాసాన్ని పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ఆలయ నిర్వాహకుడు రామకృష్ణ ఆధ్వర్యంలో పుట్ట పెద్దమ్మ అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పుష్పాలంకరణ, కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించారు. అదేవిధంగా అమ్మవారి శాలలో వాసవీమాతకు, కొలుములపల్లె రహదారిలోని చౌడేశ్వరీ దేవికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

పాతబస్టాండ్‌లో జాతిపిత విగ్రహ ఏర్పాటుకు సన్నాహాలు

డోన్ : పట్టణ నడిబొడ్డున పాతబస్టాండ్‌లో నలభై ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన జాతిపిత మహాత్మగాంధీ విగ్రహ స్థానంలో నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇందుకు సంబంధించిన పనులను ఇప్పటికే చేపట్టామన్నారు. రూ.12లక్షలతో ఏర్పాటు చేయనున్న ఏడు అడుగుల జాతిపిత కాంస్య విగ్రహ నమూనాను ఆయన ఈ సందర్భంగా పాత్రికేయులకు చూపించారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చేతుల మీదుగా ఫిబ్రవరి 1న నూతన విగ్రహాన్ని ఆవిష్కరింపజేస్తామని ఆయన వివరించారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె పట్టణం సచివాలయం-1 పరిధిలో బుధవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఎస్‌వీ చైతన్య స్కూల్ ఏరియా, ఆంజనేయస్వామి వీధి, కూరగాయాల మార్కెట్, రాయల్ కూల్‌డ్రింక్స్ తదితర ఏరియాల్లో ఎమ్మెల్యే పర్యటిస్తారన్నారు. ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే వివరించడంతోపాటు సమస్యలు తెలుసుకుని పరిష్కార చర్యలు తీసుకుంటారన్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, బూత్ కమిటీ కన్వీనర్లు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కోవెలకుంట్ల సీఐ బదిలీ

కోవెలకుంట్ల: త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసు అధికారుల బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. కోవెలకుంట్ల పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న రామానుజులును వైఎస్సార్ జిల్లాకు బదిలీ చేస్తూ పోలీసు ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన మూడు నెలల క్రితం కోవెలకుంట్ల సీఐగా విధుల్లో చేరారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మూడు సంవత్సరాలకు పైగా పనిచేసిన పోలీసు అధికారులు బదిలీ కావాల్సి ఉంది. ఈ మేరకు రామానుజులును వైఎస్సార్ జిల్లా ఖాజీపేట సీఐగా బదిలీ చేస్తూ ఉత్వర్వులు జారీ అయినట్లు పోలీసు వర్గాలు పేర్కొన్నాయి.

ఆలయాభివృద్ధికి విరాళం

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి మంగళవారం నంద్యాల జిల్లా మూలసాగరం గ్రామానికి చెందిన మేడం పెద్దవెంగళరెడ్డి రూ.50వేల విరాళం అందజేశారు. ఆలయ ఈఓ రామానుజన్‌కు దాత నగదు అందజేశారు. దాత మేడం పెద్దవెంగళరెడ్డిని ఈఓ సన్మానించి అమ్మవారి ప్రసాదం అందజేశారు.

మహనీయుల అడుగు జాడల్లో నడవాలి



బోస్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి



నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం రాజయ్య

డోన్ టౌన్ : మహనీయులు స్వాతంత్ర సమరయోధుల అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలి అని డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం స్వాతంత్ర సమర యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర పోరాటంలో సుభాష్ చంద్రబోస్ జరిపిన ఆయుధపోరాట ప్రతిమను,మిలటరీ సిపాయిల్లో నింపిన స్ఫూర్తిని ఈ సందర్భంగా డీఎస్పీ గుర్తు చేశారు. కార్యక్రమంలో భ్రూణ హత్యల నివారణ కమిటీ సభ్యులు, సామాజిక కార్యకర్త మమ్మద్‌రఫీ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ ఏఈ నాగరాజు, సిబ్బంది సలీం, దస్తగిరి, అమర్, రమేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో : నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు దేవేంద్రుడు ఆధ్వర్యంలో పాతబస్టాండ్ సమీపంలోని ముక్తేశ్వర ఆలయంలో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని పలు ప్రాంతాల్లో యాచకులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్టీ మోర్చా రాష్ట్ర సభ్యులు శివశంకర్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆశోక్‌కుమార్ పాల్గొన్నారు.

నేతాజీ ఆశయాలను సాధిద్దాం

కోవెలకుంట్ల: స్వాతంత్య్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించి ప్రాణత్యాగం చేసిన నేతాజీ సుభాష్‌చంద్రబోస్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని వక్తలు పిలుపునిచ్చారు. మంగళవారం నేతాజీ 127జయంతిని బనగానపల్లె నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక మేజర్‌గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, ఈఓ గోపినాథ్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ హెచ్‌ఎం రాజయ్య, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ రామసుబ్బారెడ్డి, పరంధామ నిలయంలో రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి ఆధ్వర్యంలో నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ఆర్థిక కార్యదర్శి శ్రీపతి, ఉపాధ్యాయులు నాగేశుడు, మల్లికార్జున, సురేష్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, శివశంకర్‌రెడ్డి, సుగుణ, వెంకటేశ్వర్లు, వెంకటలక్ష్మి, సుధీర్, రమేష్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

పకడ్బందీగా కులగణన

సంజామల: కులగణన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ నాగకుమార్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని గిద్దలూరు గ్రామంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు నిర్వహిస్తున్న కులగణన సర్వేను ఎంపీడీఓ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లడుతూ తప్పులు లేకుండా సర్వే చేయాలన్నారు. చిన్న పిల్లలు, పురుషులు, మహిళలు తదితర సమాచారం సేకరించి వెబ్‌సైట్‌లో పొందుపరచాలన్నారు. కార్యక్రమంలో ఈఆర్‌డీఓ పాపా రాయుడు, పంచాయితీ కార్యదిర్శి విష్ణు వర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గిద్దలూరులో కులగణ సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నాగకుమార్

రోడ్డు నిబంధనలు పాటించాలి

డోన్ రూరల్ : వాహనచోదకులు రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆర్‌టీఓ క్రాంతికుమార్ సూచించారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా మంగళవారం పట్టణం సమీపంలోని 44వ రహదారిపై ఆర్టీఓ వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ వాహనచోదకులు రోడ్డు నిబంధనలను వివరించారు. మద్యం సేవించి వాహనము నడిపితే సెక్షన్ 185 ప్రకారము ఆరు నెలలు జైలు శిక్ష విధించడం జరుగుతుందని హెచ్చరించారు. అలాగే వాహనాలకు సంబంధించిన రికార్డులు తప్పనిసరిగా ఉంచుకోవాలని సూచించారు.

నేడు నియోజకవర్గస్థాయి క్రీడాపోటీలు ప్రారంభం

బనగానపల్లె రూరల్ : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదనంలో బుధవారం నిర్వహించే నియోజకవర్గస్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తామని ఎంపీడీఓ శివరామయ్య తెలపారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, ఖోఖో పోటీలు ఉదయం 9.30 గంటలకు ప్రారంభవుతాయని, క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయలు హాజరుకావాలని ఎంపీడీఓ తెలిపారు.

పంట కోతపై అవగాహన సదస్సు

డోన్ రూరల్ : మండల పరిధిలోని కామగానికుంట్ల, ఆవులదొడ్డి గ్రామాలలో మంగళవారం ఉద్యాన శాఖ అధికారి కళ్యాణి ఆధ్వర్యంలో పంటకోత ప్రయోజనంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ పంట కోతల్లో అధికారులు సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ మండల కోర్డినేటర్ అబ్దుల్లా, రైతు భరోసా కేంద్రం సిబ్బంది హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

మహా సభలను విజయవంతం చేయండి

డోన్ టౌన్ : విజయవాడలోని కామినేని హాస్పిటల్స్ రోడ్‌లో ఉన్న అనుమల గార్డెన్స్‌లో ఫిబ్రవరి 4న నిర్వహించే గ్రామీణ వైదుల మహా సభలకు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని డోన్ మండల ఆర్‌ఎంపీ వైద్యుల సంక్షేమ సంఘం గౌరవ ధ్యక్షుడు, అధ్యక్షుడులు కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, నాయకులు బాల సుబ్బయ్య, కేహెచ్ బాషా, ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. మహా సభల పోస్టర్లను మంగళవారం వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మహా సభల్లో క్యాన్సరు వ్యాధిపై అవగాహన, ఆర్‌ఎంపీ వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.